# బీఆర్ఎస్ పాలనలోనే మహిళా సంక్షేమం

- బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు

వెంగళరావునగర్, నవంబర్ 23 : బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం రహ్మత్ నగర్ డివిజన్‌కు చెందిన ఎ.సుజాత, ఎ.మీనా ఆధ్వర్యంలో 100 మంది మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మాగంటి గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ.. సీఎం కేసీఆర్ వారి మనసుల్ని గెల్చుకున్నారని అన్నారు. పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు నిర్మించారని, ఒంటరి మహిళలకు ఆసరా పింఛన్లు, పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టి పెద్ద మనసు చాటుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ చేసే దుష్ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాగంటి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి తాము బీఆర్ఎస్ లో చేరనట్లు మహిళలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు కె.నర్సింహారెడ్డి, నజీర్, అరుణ్, రాకేశ్, శ్రీధర్, చేపల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రహ్మత్‌నగర్ డివిజన్‌లో మహిళలకు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

### మాగంటిని మరోమారు గెలిపించండి

జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను మరోసారి గెలిపించాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య రావు ఓటర్లను కోరారు. మాగంటి గోపీనాథ్‌ను గెలిపించాలని గురువారం డివిజన్‌లోనీ యాదగిరినగర్, రహ్మత్‌నగర్‌లో ఆమె ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడ డివిజన్ తిరుమల అపార్ట్‌మెంట్‌లోప్రచారం చేస్తున్న కార్పొరేటర్ రాజ్‌కుమార్‌పటేల్ –జూబ్లీహిల్స్

### బస్తీల్లో ముమ్మర ప్రచారం

ఎర్రగడ్డ : బీఆర్ఎస్ అభ్యర్థి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించడమే ధ్యేయంగా ఆ పార్టీ శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి, అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటేసి మాగంటిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. స్వరాజ్‌నగర్‌లో బీఆర్ఎస్ బోరబండ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జి సిరాజ్, రజ్వీ, అహ్మద్, ఫిర్దౌజ్, అబ్దుల్‌ఖయ్యూం, గౌస్, మతీన్, శ్యాం, భారత్‌నగర్‌లో ఖలీల్, అమీర్, ఇర్ఫాన్ తదితరులు ప్రచారం నిర్వహించారు. బంజారానగర్‌లో ముత్యాలు, శంకర్‌రాథోడ్ నాయక్, యాదయ్య తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు.

## ముమ్మాటికీ మాగంటిదే విజయం..

- సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అంతిమ విజయం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌దేనని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం శ్రీనగర్ కాలనీ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణలో గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి జరిగిందన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తూ చీకట్లను పారద్రోలిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అనేక అభివృద్ధి పనులు చేపట్టారని, అభివృద్ధి మున్ముందు కొనసాగించడానికి కారు గుర్తుకే ఓటు వేయాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు.



శ్రీనగర్‌కాలనీలో ప్రచారం చేస్తున్న సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్‌యాదవ్



వెంగళరావునగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ దేదీప్యరావు,తదితరులు



స్వరాజ్‌నగర్‌లో ప్రచారంలో పాల్గొన్న కృష్ణమోహన్, తదితరులు

## పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు

జూబ్లీహిల్స్, నవంబర్ 23 : పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ శేరిలింగంపల్లి జోనల్ డీసీ మంగతాయారు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా రాత్రి సమయాల్లో కమర్షియల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ చేపట్టాలని సూచించారు. గురువారం యూసుఫ్‌గూడ సర్కిల్ డంపింగ్ యార్డ్‌ను ఏఎంఓహెచ్ డాక్టర్ కేఏస్ రవి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రాత్రిపూట శానిటేషన్, స్వచ్ఛ ఆటోల పనితీరును సమీక్షించారు. చెత్తను తరలించేందుకు నైట్‌షిఫ్ట్‌లోనూ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రాత్రి వ్యాపారాల వద్ద చెత్త తొలగించి ఉదయంకాలనీలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ మేరకు వ్యాపార సముదాయాల వద్ద స్టిక్కర్లతో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. దుకాణాల యజమానులు వ్యర్థాలను డబ్బాల్లో వేసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. అనంతరం డంపింగ్ యార్డులో స్వచ్ఛఆటోల రిజిస్టర్లను ఆమె తనిఖీ చేశారు. ఎస్ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడ డంపింగ్ యార్డులో ఏఎంఓహెచ్ డాక్టర్ రవితో కలిసి స్వచ్ఛఆటోల రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎమ్ డీసీ మంగతాయారు

## కేవీబీఆర్‌లో ఈవీఎంల పనితీరు పరిశీలన

- పర్యవేక్షించిన డీఈఓ రొనాల్డ్‌రాస్



ఈవీఎంల పనితీరును తెలుసుకుంటున్న డీఈఓ రొనాల్డ్‌రాస్

జూబ్లీహిల్స్, నవంబర్ 23 : అసెంబ్లీ ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషిన్లను సంసిద్ధం చేయాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఓటింగ్ యంత్రాల పనితీరును అధికారులతో కలిసి పరిశీలించారు. 30న జరుగనున్న పోలింగ్ సందర్భంగా జూబీహిల్స్ నియోజకవర్గంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఓటింగ్ యంత్రాలు మొరాయించకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని.. అదనపు ఈవీఎంలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి, ఎన్నికల అబ్జర్వర్ జయకాంతన్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సేవా ఎస్లావత్, ఏఈఆర్‌ఓలు ఏసీపీ రాణి, ఏఎంసీలు బాల్‌రాజ్, కమల్, తాసీల్దార్ నయీముద్దీన్ పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- జూబ్లీహిల్స్ ఎన్నికల పరిశీలకుడు జయకాంతన్



ఈఈ రాజ్‌కుమార్‌తో కలిసి ఓటర్ స్లిప్పుల పంపిణీని పరిశీలిస్తున్న జూబ్లీహిల్స్ ఎన్నికల పరిశీలకుడు జయకాంతన్

జూబ్లీహిల్స్, నవంబర్ 23 : అర్హులంతా విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జూబ్లీహిల్స్ ఎన్నికల పరిశీలకుడు జె.జయకాంతన్ సూచించారు. ఓటర్‌కు పోలింగ్ బూత్‌ల సమాచారాన్ని తెలియచేసేందుకు బూత్ నంబర్లతో స్లిప్పులు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియను ఈఈ రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బీఎల్ఓ సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి వరకు ఓటర్ స్లిప్పుల పంపిణీ

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్ స్లిప్పుల పంపిణీపై జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ ఆఫీసర్ సేవా ఎస్లావత్‌తో గురువారం ఆయన సమీక్షించారు. నియోజకవర్గంలోని 329 పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రతి ఓటరుకు శుక్రవారం వరకు ఐడెంటిఫికేషన్ స్లిప్పులు అందజేయాలని ఆదేశించారు.

## ఇంట్లో వజ్రాభరణాలు, బంగారు నగలు చోరీ

- పనిమనిషి పైనే అనుమానాలు
- మధురానగర్ పోలీసులకు యజమాని ఫిర్యాదు

వెంగళరావునగర్, నవంబర్ 23 : ఇంట్లోని అల్మారాలో దాచిన వజ్రాభరణాలు, బంగారు నగలు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పని మనిషిపైనే అనుమానాలు వ్యక్తం చేస్తూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ఉదయ్ తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ కాలనీలో నివాసముంటున్న రియల్టర్ వై.రాఘవన్ ఇంట్లో ఏడాది కాలంగా ఓ మహిళ పని చేస్తున్నది. కాగా ఇంట్లోని అల్మారాలో 250 గ్రాముల వజ్రాభరణాలు, బంగారు నగలను యజమాని రాఘవన్ నెల కిందట దాచిపెట్టాడు. అల్మారా తాళం చెవులను అక్కడే పెట్టాడు. గురువారం ఉదయం పెండ్లికి వెళ్లేందుకు నగలు ధరించాలని భావించిన కుటుంబసభ్యులు అల్మారా తెరవగా అందులో వజ్రాభరణాలు, బంగారు నగలు కనిపించలేదు. పని మనిషిని ప్రశ్నించగా.. తనకేమి తెలియదని చెప్పింది. దాంతో పని మనిషిపై అనుమానం వ్యక్తం చేస్తూ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ తెలిపారు.